
SREE HARI BOOK BANK
STREET, TIRUPATI




# చిన్నబహుమతి

పొడుగాటి కవరు బార్డర్‌కి నాలుగువైపులా ఎరుపు నీలంరంగుల్లో అందమయిన డిజైన్ పైన ఎడ్రస్ నీట్‌గా టైప్ చేయబడివుంది ఇంగ్లీష్‌లో. కవరుకు కుడివైపు పైన రెండు అమెరికన్ పోస్టల్ సర్వీస్ ఎయిర్ మెయిల్ స్టాంప్స్ అంటించబడి వున్నాయి.

ఆ రెండు స్టాంప్స్ వంక చూశాడు దిలీప్ ఒక్కొక్కదాని విలువ ఇరవై ఒక్క సెంట్స్ కవరునుంచి మంచివాసన వేస్తోంది. సువాసనగల సెంటెడ్ కవర్ అది.

జాగ్రత్తగా కవరు విప్పాడు దిలీప్ కవరులోంచి మూడుమడతలు పెట్టివున్న తెల్లకాగితంతోపాటు సైన్ పెన్‌తో అందంగా వ్రాయబడివున్న అక్షరాలు పొందికగా వున్నాయి.

కెరొలిన్ నుంచి ఆ ఉత్తరం.

హీ దేర్ ఫ్రండ్.

నీ ఉత్తరం కొద్దిగా ఆలస్యంగా అందింది. కారణం ఈసారికూడా పోస్టల్ సర్వీస్ వాళ్ళదే.

ఈ నెల తొమ్మిదో తేదీన పుట్టిన రోజని తెలిసి. చాలా సంతోష

పడ్డాను. మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే. నీ పుట్టినరోజుకు ఓ చిన్న బహుమతి పంపుతున్నాను. ఆ పార్శిల్ దీనితోపాటు అందుతుందని నమ్ముతాను. దయచేసి స్వీకరించు.

ఆ రోజు- అంటే డిసెంబర్ తొమ్మిదో తారీకున ఫొటోతోబాటు, పుటినరోజు గ్రీటింగ్స్‌కూడా ఇక్కడి లోకల్ పేపర్ "టుడే"లో పర్సనల్ కాలమ్‌లో ప్రచురించే ఏర్పాట్లు చేస్తాను. దాదాపు పదమూడు లక్షల మంది చదువుతారు ఆ పేపర్ రోజూ. పేపర్ కటింగ్ తర్వాత ఉత్తరంలో పంపుతాను.

"తాజ్‌మహల్" ఫోటో ఎంతో బాగుంది నాకు. మా యింటో అందరికీ బాగా నచ్చింది. కలర్ ఫోటో అయితే ఇంకా బాగుండేది. ఇక్కడ కెమేరా ప్రతి ఇంట్లో తప్పకుండా వుండే ఓ ముఖ్యమైన వస్తువు. ఇండియాలో చాలామందికి కెమేరా లుండవని తెలిసి ఎంతో ఆశ్చర్యపడ్డాము.

చలి విపరీతంగా పెరుగుతోంది రోజు రోజుకి క్రిస్టమస్ దగ్గర పడుతోందిగా మరి. ఈసారి క్రిస్టమస్‌కి ఫర్ కోట్ బహుమతి ఇస్తారనుకుంటాను మా నాన్న.

వెంటనే సమాధానం వ్రాయి. క్రిస్టమస్ రోజునయినా రావాలి ఉత్తరం కనీసం.

లవ్

-కెరొలిన్

(ఏజ్. స్వీట్ సిక్స్‌టీన్)

దిలీప్ ఉత్తరం చదివాడు రెండుమూడు సార్లు. తన కలం స్నేహితురాలు వ్రాసిన ఉత్తరం. దాదాపు పదమూడు లక్షలమందికి తన పుట్టినరోజు గురించి అమెరికన్ పౌరులకి తెలిసిపోతుంది. తన రూపంతోబాటు అనుకోగానే ఒళ్ళు పులకరించింది.

ఎక్కడి అమెరికా, ఎక్కడి ఇండియా, మధ్యలో పెద్ద సముద్రం అడ్డు. ఎన్నోవేల మైళ్ళు అడ్డు. అయినా తన సంగతి చాలామందికి తెలుస్తుంది డిసెంబర్ తొమ్మిదో తారీకే!

"ఎక్కడనుంచి ఉత్తరం" అని అడిగాడు దిలీప్‌ని అతని నలభై ఏళ్ళ చిన్న మామయ్య.

"కెరొలిన్ నుంచి" గర్వంగా చెప్పాడు పదిహేనేళ్ళ దిలీప్ మామయ్యకి.

"ఎవరు కెరొలిన్?"

"నా పెన్‌ఫాల్. అమెరికానుంచి కేలిఫోర్నియా" చెప్పాడు మళ్ళీ హుందాగా.

"గుడ్ పెన్ ఫ్రండ్‌షిప్ అన్నమాట?"

"అవును, రెండు సంవత్సరాలనుంచి జరుగుతోంది మా ఇద్దరికీ."

"కెరొలిన్‌తో ఎలా పరిచయం అయింది?"

"అమెరికన్ ఎంబసీకి వ్రాస్తే వాళ్ళు, అమెరికాలో పెన్ ఫ్రండ్‌షిప్ విషయంలో సహాయం చేసే ఓ క్లబ్ అడ్రసు ఇచ్చారు. ఆ క్లబ్ నన్ను కెరొలిన్‌కి పరిచయం చేస్తుంది."

"నెలకి ఎన్ని ఉత్తరాలు వస్తాయి?"

"రెండు తప్పకుండా వస్తాయి."

మర్నాడు పార్సెల్ వచ్చింది. పోస్టుమాన్ తీసుకువచ్చాడు. ఎడ్‌హెసివ్ టేప్‌తో చక్కగా పేక్ చేయబడి వుంది. సంతకంపెట్టి తీసుకున్నాడు దిలీప్.

ఇంట్లో అంతా గుమిగూడారు దిలీప్ పార్సెల్ విప్పుతూంటే.

కెమేరా!

కొడక్ కెమేరా చిన్నగా వున్నా అందంగా వున్నది. కెరొలిన్ చేతి వ్రాతతో వ్రాయబడివున్న కార్డ్ కెమెరాకి ఓ అందమయిన ప్లాస్టిక్ చేన్‌తో జత చేయబడి వుంది.

"విష్ యు మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే."

దిలీప్ మామయ్య పార్సెల్‌లోంచి బ్రోచర్ తీసి, ఆ కెమేరా ఉపయోగించే విధం చదివి అర్ధం చేసుకుని, వివరించాడు దిలీప్‌కి.

"రీల్ వుందా మామయ్యా? ఫోటో తీయవచ్చా అయితే ఇప్పుడు?" అడిగాడు దిలీప్ ఉత్సాహంగా.

"తీయవచ్చు రీల్ వుంది కెమేరాలోనే."

"బలే. బలే. అయితే ఫోటోలు తీసుకుందాం మామయ్యా."

"అలాగే, కాని రీల్ అయిపోతే మళ్ళీ దొరకదు."

"రాసి తెప్పించుకోవచ్చు కెరొలిన్ నుంచి" మళ్ళీ దిలీప్ ఒక్కడే తీసుకున్నాడు తన ఫోటోని.

తర్వాత అమ్మా నాన్నలతో దిలీప్‌ని తీశాడు మామయ్య.

తర్వాత అంతా కలసి తీసుకున్నారు ఆ ఆటోమేటిక్ కలర్ కెమేరాతో.

చివరికి తీశారు కుందేలుని దాన్ని వుంచిన పంజరంలాంచే.

"దీనికి ఎంత అదృష్టం? ఎక్కడో అడవిలో చచ్చిపోవాల్సిన ఇది. అమెరికాలో తయారయిన కలర్ కెమేరాతో ఫోటో తీయించుకునే అవకాశం కలిగింది." అన్నాడు దిలీప్ మామయ్య నవ్వి.

"మామయ్యా. మళ్ళీ చెప్తావా దీన్ని ఎలా పట్టుకున్నావో?" అడిగాడు దిలీప్.

"ఆ కుందేలు అడవిలో ఏవిధంగా పట్టుపడిందోచాలాసార్లు విన్నాడు దిలీప్. మామయ్య చెప్పగా. అయినా మళ్ళీ మళ్ళీ అడిగి చెప్పించుకుని వింటూంటాడు దిలీప్ వీలయినప్పుడల్లా మామయ్య ద్వారా.

దిలీప్‌కు ఫారెస్ట్ రేంజర్‌గా పనిచేస్తున్న తన మామయ్య వృత్తన్నా, అడవుల్లో తను చేసిన సాహసాలను వర్ణించిచెప్తున్న మామయ్యన్నా ఎంతో ఇష్టం. తన మామయ్య చేసిన సాహస కృత్యాలని అడవుల్లోని అతని జీవితాన్ని గురించి తెలుసుకోవాలంటే ఎంతో ఆసక్తిగా వుంటుంది దిలీప్‌కి. ఆ వయస్సులో.

"చాలాసార్లు చెప్పానుకదురా" అన్నాడు దిలీప్ మామయ్య నవ్వుతూ.

"అయినా మళ్ళీ చెప్పు మామయ్యా వింటాను."

"సరే....విను అయితే మళ్ళీ. ఇక్కడికి శలవుపెట్టి రాబోయే ముందు ఓరోజు సాయంత్రం పులిగాండ్రింపువిని బయటకు వచ్చాను. రెండుసార్లు తుపాకి పేల్చగానే ఆ చప్పుడికి బెదిరిపోయి పారిపోయింది."

"ఎందుకు చంపలేదు దాన్ని?"

"వూహూ చంపకూడదు. వన్యమృగ రక్షణ పథకం క్రింద వాటిని చంపితే శిక్షిస్తుంది ప్రభుత్వం."

"తర్వాత."

ఆ పులిని మామయ్య చంపివుంటేనే బాగుండేది అనుకున్నాడు దిలీప్ మనస్సులో.

"కొంచెం దూరం వెళ్ళాక ఓచోట చూసాను ముళ్ళచెట్లమధ్య. గుబురుగా పెరిగిన ఓ పొదలో ఈ కుందేలుని"

"తర్వాత"

"నన్ను చూసి బెదిరి పారిపోతుందనుకున్నాను. పారిపోలేదు. కుందేళ్ళు చిన్న చప్పుడయినా బెదిరి పారిపోతాయి. నాకు కొద్దిగా ఆశ్చర్యం వేసింది. దాన్ని పట్టుకుందామనుకున్నాను ఎలగయినా"

"తర్వాత?"

"ఆ కుందేలుదగ్గరకి వెళ్ళలేకపోయాను. చుట్టూ ముళ్ళచెట్లు గుబురుగా వున్నాయి. పరీక్షగాచూస్తే తెలిసింది. దాని కుడికాలు ఆ పొదలోని ఓ తీగకి వుంది చిక్కుకొని. ఆ చిక్కులోంచి పారిపోలేక అలాగేవుంది. ఎప్పటినుంచో. ఎలా చిక్కుపడిందో అక్కడ."

"నువ్వేం చేశావ్?"

"నాలుగయిదు నిమిషాలు ప్రయత్నం చేశానుకాని నాకు చేతకాలేదు. ఇంతలో చూశాను ఓ పెద్ద కొండచిలువని."

"ఎంత వుంది?"

"ఎనిమిదడుగులుంది. చాలా లావుగా వుంది. నెమ్మదిగా కుందేలు వైపు పాకుతోంది దాని పెద్ద శరీరాన్ని ఈడ్చుకుంటూ."

"నువ్వేం చేశావ్?"

ఏంచేశాడో తెలిసినా ఆత్రంగా అడిగేయకుండా వుండలేకపోయాడు దిలీప్.

"రైఫిల్‌తో గురిచూసి ఆ కొండచిలువని కాల్చాను నాలుగుసార్లు. శరీరంలో నాలుగుచోట్ల తగిలాయి గుళ్ళు. చచ్చిపోయింది వెంటనే."

"కొండ చిలువని చంపవచ్చా?"

"చంపచ్చు. దానికి దొరకనంత వరకు అది చాలా నిరపాయకర మైనది. చిక్కితే మాత్రం ఇక చావు తప్పదు. మనిషినయినా సరే, శరీరంతో చుట్టేసి. కదలకుండా బంధించి, పిండి పిండి చేసేస్తుంది తన పట్టుతో. ఎముకలు విరిగి, నలిగి చచ్చిపోతుంది దాని బంధనంలో ఏది చిక్కు కున్నా, తర్వాత నెమ్మదిగా అలాగే మింగేస్తుంది. ఒక్కొక్కసారి నాలాంటి వాణ్ణి మింగేందుకు రెండు, మూడు రోజులు తీసుకుంటుంది కూడా."

"తర్వాత."

"కాంప్‌లో వున్న ఓ పెద్ద కత్తి తెచ్చి ఆ ముళ్ళ పొదలు కొట్టేసి, దారిచేసుకుని వెళ్ళి. దాని కాలికున్న పొద తీగ చిక్కుని విడిపించి కాంప్‌కు తీసుకువచ్చి చిన్న పంజరంలో బంధించాను."

"బలే, బలే."

దిలీప్ తమ్ముడు ఆరేళ్ళవాడు చప్పట్లు కొట్టాడు సంతోషంగా. వాడు కూడా వింటున్నాడు రేంజర్ మామయ్య చెప్పే కథని శ్రద్ధగా.

"మా ఆఫీసర్ పర్మిషన్ తీసుకుని ఆ కుందేలుని తీసుకువచ్చి నీకు ప్రజెంట్ వేస్తాను."

ముగ్గురూ, ఎక్కడో అడవిలో ఓ కొండచిలువ పొట్టలో పడాల్సిన ఆ కుందేలు వంక చూశారు! పంజరంలో అందంగా ఉంది. వెనక కాళ్ళమీద కూర్చొని, తెల్లటి దేహం పొడవాటి చెవులు నల్లటి కళ్ళు, ఎర్రటి మూతి చూడటానికి ముద్దొస్తోంది.

"ఫోటోలు ఎప్పుడొస్తాయి మామయ్యా?" అడిగాడు దిలీప్.

"నాలుగయిదురోజుల్లో."

"ఈ సారి ఉత్తరంలో రాస్తాను ఇంకో రీలు పంపమని కెరొలిన్‌కి."

"మరి కెరొలిన్‌కి నువ్వు ఏం పంపిస్తున్నావు?" అడిగాడు దిలీప్ మామయ్య దిలీప్‌ని.

"దేనికి?"

"క్రిష్టమస్‌కి, వాళ్ళకి కిష్టమస్ చాలా పెద్ద పండుగ."

"ఏం పంపించను?" అడిగాడు.

"ఏదయినా మంచిది పంపాలి. మర్యాదగా వుంటుంది."

"నువ్వే చెప్పు మామయ్యా ఏం పంపాలో?"

"ఓ మంచి బొమ్మ కొని పంపిద్దాం. హేండీక్రాఫ్ట్స్ ఎంపోరియమ్‌లో మంచివి దొరుకుతాయి."

"అలాంటి బొమ్మలు రెండు మూడుసార్లు పంపించాడు ఇదివరకే." దిలీప్ నాన్నగారు చెప్పారు.

"ఓ మంచి చీరకూడా పంపాడు ఇదివరకే" చెప్పింది దిలీప్ తల్లి.

"మరి ఏం పంపను మామయ్యా ఈసారి?" అడిగాడు దిలీప్.

"ఓ మంచి దంతం బొమ్మ చూశాను. గాంధీమహాత్ముడిది, గవర్నమెంట్ హేండీక్రాఫ్ట్స్ ఎంపోరియంలో. చవకలో వచ్చేటట్లయితే దాన్ని పంపుదాం అన్నాడు. దిలీప్ మామయ్య.

సాయంత్రం షాప్‌కి వెళ్ళారుగాని ఆ బొమ్మలేదు. ఎవరో కొనుక్కువెళ్ళిపోయారు.

దిలీప్ తమ్ముడు సూచించాడు తిరిగి వస్తుంటే.

"మామయ్య మన కుందేలుని పంపితే అన్నయ్య స్నేహితురాలికి?"

"భేషయిన ఆలోచన. మంచిది, కుందేలునే పంపుదాం" అన్నాడు దిలీప్ మామయ్యా.

"వద్దు మామయ్యా. నాకా కుందేలంటే చాలా ఇష్టం. దాంతో ఎంచక్కా ఆడుకోవచ్చు. మరేదయినా పంపుదాం."

తన అభ్యంతరం తెలిపాడు. దిలీప్ వెంటనే. "ఫర్వాలేదు. నీకు మరో కుందేలు తెచ్చిపెడతాను. ఈసారి వచ్చేటప్పుడు మర్చిపోకుండా. అమెరికన్స్‌కి జంతువులంటే చాలా యిష్టం. వాళ్ళు కుక్కలని, చేపలని, పెంచుకుంటూంటారు కూడా. ఇళ్ళల్లో చక్కగా పెంచుకుంటారు. నీ పేరు చెప్పుకుని ఆ కుందేలుని."

"వద్దు మామయ్యా. వచ్చే క్రిష్టమస్‌కి పంపుదాం కుందేలుని. ఈసారి మాత్రం ఏదయినా బొమ్మ పంపుదాం."

దిలీప్‌ని పంపించడానికి ఓ పూట పట్టింది పూర్తిగా, కెరొలిన్

దగ్గర ఆ కుందేలుంటే కెరొలెన్‌కూడా ముచ్చటపడుతుందని, దిలీప్ పంపిన బహుమతి నచ్చితే, ఏ కారో, టెలివిజనో తప్పకుండా పంపవచ్చని, దిలీప్ అమెరికా వెళ్ళలేకపోయినా, కనీసం ఆ కుందేలయినా, వెళ్ళగలుగుతుందనీ, ఇంకా ఎన్నో మాటలు చెప్పాడు దిలీప్ మామయ్య.

"ఒప్పుకోరా అన్నాయ్ కుందేలుకి ఇంగ్లీష్ నేర్పించి, మంచి బట్టలు కూడా కుట్టిస్తారు వాళ్ళయితే."

మామయ్యని వెనకేసుకొచ్చి చెప్పాడు దిలీప్ తమ్ముడు.

మనస్ఫూర్తిగా ఇష్టంలేకపోయినా. కెరొలిన్‌కి ఆ కుందేలు నచ్చితే, తనకి నిజంగా ఏ టెలివిజనో పంపుతుందనే ఆశతోనో ఆ కుందేలు ఇండియాలో తనదగ్గరకంటే, అమెరికాలో కెరొలిన్ దగ్గరే హాయిగా వుంటుందనో, ఒప్పుకున్నాడు దిలీప్.

ఆ కుందేలుని అమెరికాలోని తన కలం స్నేహితురాలు కెరోలిన్‌కి క్రిస్టమస్ కానుకగా పంపడానికి సమ్మతించాడు దిలీప్ చివరికి.

దిలీప్ మామయ్య వెంటనే చురుకుగా పనిచేసాడు. ఆ కుందేలు క్రిస్టమస్ కానుకగా పంపవచ్చా. లేదా, పంపితే ఏ విధంగా పంపాలి మొదలయిన వివరాలన్నీ సేకరించాడు.

మామూలు రోజుల్లో అయితే ఆ కుందేలుని పంపకూడదు. క్రిస్టమస్‌వల్ల ఆ నిబంధన సడలించింది ప్రభుత్వం.

క్రిస్టమస్ రోజున సరిగ్గా, డిసెంబర్ ఇరవై అయిదో తారీఖు కాలిఫోర్నియాలోని కెరొలిన్ ఇంటికి ఆ కుందేలు అందింపబడేలా ఏర్పాటు చేసాడు దిలీప్ మామయ్య.

వాటికి సంబంధించిన ఫారాలు తీసుకువచ్చి నింపి, ఎవరిచేత సంతకాలు చేయించాలో వాళ్ళచేత చేయించాడు. వారంరోజుల్లో పని ముగించాడు.

డిసెంబరు ఇరవైయవ తారీఖున విమానంలో పంపబడుతుంది ఆ కుందేలు. న్యూయార్క్‌కి వెళ్ళే బోయింగ్ 707లో, ఆ చిన్న జంతువు మామూలు మనుషుల లాగా ప్రయాణం చెయ్యలేదు వాతావరణంలోని మార్పులకి తట్టుకుని అన్ని వేలమైళ్ళు. దానికోసం ఓ ప్రత్యేకమయిన

కంటెయినర్ తయారుచేశారు. వాతావరణంలో మార్పులకు అతీతంగా, ఆ కంటెయినర్‌లో వుండే కుందేలుకి తగిన ఆక్సిజన్ అందుతుంది. వుష్ణం సమపాళ్ళలో వుంటుంది దాని శరీరానికి తగినట్లుగా.

ఇన్స్యూరెన్సు ఏజెంట్ స్వయంగా తణిఖీ చేసాడు విమానం కదల బోయేముందు. రాక్షసిలాగావున్న ఆ పెద్దబోయింగ్ పెద్ద చప్పుడుచేస్తూ, నేలమీద పరిగెత్తి, గాలిలోకి ఎగిరింది.

ఈ పాటికి బొంబే దాటి వుంటుంది. ఈ పాటికి సముద్రంమీద ఎగురుతూ వుంటుంది. అనుకుంటూండి పోయారు దిలీప్ కుటుంబ సభ్యులు. తను మృత్యువునుంచి తప్పించిన ఆ చిన్నకుందేలు అమెరికాలోని ఓ అందమయిన పదహారేళ్ళ పిల్లని చేరటం కించిత్ ఆనందాన్ని కలిగించింది దిలీప్ మామయ్యకి.

తన సెలవ అవగానే వెళ్ళిపోయాడు దిలీప్ మామయ్య. డ్యూటీలో చేరేందుకు నల్లమలై అడవుల్లోకి, ఇంకో కుందేలు నీకు తప్పకుండా తెస్తానని దిలీప్‌కి మాట ఇచ్చి.

జనవరి పదిహేడవ తేది. కొత్త సంవత్సరంలో మొదటి వుత్తరం వచ్చింది కెరొలిన్ నుంచి దిలీప్‌కి.

ఆ ఉత్తరంకోసమే ఎదురుచూస్తున్నాడు దిలీప్. తన క్రిష్టమస్ కానుక కెరొలిన్‌కి తప్పకుండా వచ్చివుంటుందని తెలుసు. దాన్ని గురించి ఏం వ్రాస్తుందో వూహించ లేకపోతున్నాడు. సస్పెన్స్‌గావుంది బాగా.

గజగజ వణికించే చల్లటి ఆ దేశంలో ఓ రాష్ట్రంలోని వూళ్ళోవున్న ఇంట్లో, అందమయిన నూన్‌లో, ఇంకా అందంగా ఉండే కెరొలిన్—పదహారేళ్ళ బాల-గాజు తలుపులతో ఉన్న ఇంట్లో కూర్చుని, చేతిలో తెల్లని కుందేలుతో ఆడుకుంటూ, కురుస్తున్న తెల్లని మంచుస్లేక్స్ వంక చూస్తుంటుంది. అలా ఆడుకుంటూ, ఆ కుందేలుని ముద్దు పెట్టుకుంటూ, తనని గుర్తు తెచ్చుకుంటుంది.

ఈ దృశ్యం చాలాసార్లు దిలీప్ వూహల్లోకి వచ్చింది. ఒకసారి కలలోకి కూడా వచ్చింది. అదేపనిగా ఆలోచించి పడుకోవటం వల్ల.

ఆత్రంగా విప్పాడు ఆ పెంకెడ్ ఎన్వలప్‌ని తెల్లటి కాగితంమీద అతి చక్కని వ్రాత. నీలంరంగు సైన్‌పెన్‌తో వ్రాయబడి ఉంది ముత్యాల్లా.

హా డేర్ ఫ్రెండ్.

హేపీ న్యూ ఇయర్. ఎన్ని థ్యాంక్స్ చెప్పినా చాలదు నీకు. నాకు ఈ పదహారేళ్ళలో వచ్చిన కానుక లన్నిటిలోకి అతి అందమయింది. నాకు మనస్ఫూర్తిగా నచ్చింది ఆ కుందేలు పక్కాటే. క్రిష్టమస్ ముందురోజు రాత్రి అందింది. అంతచక్కటి బహుమతి వూహించినందుకు నా ధన్య వాదాలు. మా అమ్మా, నాన్నకూడా ధన్యవాదాలు తెలుపమన్నారు.

నేను రెండురోజుల క్రితం తీయించుకున్న ఫోటో. "టుడే" పేపర్ కట్టింగ్ జతపరుస్తున్నాను.....

ముందర పేపర్ కటింగ్ చూశాడు. అమెరికన్ పేపర్ మీద ఓ మూల తనఫోటో ముద్రింపబడిఉంది. పూర్తిగా చదివాడు క్రింద రాసింది. గ్రీటింగ్స్.

తర్వాత ఫోటోవంక చూసాడు. కలర్ ఫోటో అది. కెరొలిన్ ఒక్కతే నిలబడివుంది. ఓ ఫ్రిజిడేర్‌కి ఆనుకొని నవ్వుతూ కెమేరాలోకి చూస్తోంది.

దిలీప్ కళ్ళు చికిలించిచూశాడు-మరుక్షణంలో కుంచించుకుపోయాయి.

కెరొలిన్ తలమీద ఓ అందమయిన టోపీ తెల్లటి టోపీ చేతులకి అందమయిన తెల్లటి గ్లవ్స్!

గబగబా వుత్తరంమీదకి సారించాడు దృష్టిని కింద సంతకం అయిన తర్వాత పోస్ట్‌స్క్రిప్ట్‌లో వ్రాసివుంది కెరొలిన్ చేతి వ్రాతతో.

"నీ ప్రజంటేషన్ బాగానచ్చింది ఇంట్లో అందరికీ. అంత రుచికర మైన మాంసం నేను జీవితంలో ఎప్పుడూ తినలేదు. రేబిట్ హెంబర్గర్ ఇప్పుడు నా ఫేవరేట్ డెలికసి."

ఆ రాత్రి అంతా వెక్కి వెక్కి ఏడుస్తూనే వున్నాడు దిలీప్-ఖాళీగా వున్న ఆ కుందేలుని వుంచిన పంజరాన్ని చూస్తూ.

(ఆంధ్రజ్యోతి వారపత్రిక 31-8-1973 సంచిక)